క్లుప్తంగా

ప్రతి విద్యార్థికి సీటు కేటాయించాలి



మాట్లాడుతున్నఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా

కర్నూలు(సెంట్రల్) : సంక్షేమ హాస్టళ్లలో చేరేందుకు దరఖాస్తు చేసిన ప్రతి విద్యార్థికి సీటు కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చాలా సంక్షేమ హాస్టళ్లలో మరుగుదొడ్లు, ప్రహరీలు, తాగునీటి సమస్యలు ఉన్నాయన్నారు. వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అమర్, శివ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాడాలి



మాట్లాడుతున్న రాజగోపాల్

కర్నూలు(సెంట్రల్):సీపీఎం నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి పోరాడాలని పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు రాజగోపాల్,ఎస్‌ఎండీ షరీఫ్, అబ్దుల్ దేశాయ్ పిలుపునిచ్చారు.శుక్రవారం సుర్జీత్ భవన్‌లో ముఖ్య కార్యర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ..చిన్న చిన్న వ్యాపారాలు చేసు కుంటున్న వారికి ప్రభుత్వం షరతులు లేకుండా బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించాలన్నా రు. ఇళ్లులేని పేదలకు ఇళ్లు కట్టించాలని, కరెంట్ బిల్లులు ఎక్కువ రాకుండా చూడాలని కోరారు.

నేడు విద్యుత్ కోత

కర్నూలు(అగ్రికల్చర్):విద్యుత్ లైన్‌లు, సబ్ స్టేషన్‌ల మెయిన్‌టెనెన్స్ పనులు చేపడుతుండటంతో నేడు (శనివారం) వివిధ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు.ఉదయం 9 గంటల నుంచి మధ్యా హ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా బంద్ అవుతుందని,వినియోగదారులు సహకరించాలని సూచించారు. డి2 సబ్ డివిజన్‌లోని క్యాంపస్ సెక్షన్ పరిధిలో మద్దూర్ నగర్, సీ.క్యాంపు, గణేష్‌నగర్, రెవెన్యూ కాలనీ, 4వ తరగతి ఉద్యోగుల సంఘం కాలనీ, సాయి వైభవ్ నగర్, చెక్‌పోస్టు ఏరియా,శేషాద్రి నగర్, బృందావన్‌నగర్, మారుతి నగర్,అరుంధతి నగర్‌తో పాటు పరిసర ప్రాంతాలు,రెవెన్యూకాలనీ, శ్రీరామ్‌నగర్, మారుతి మెగా సిటీ, పోస్టల్ కాలనీ, ధనలక్ష్మీనగర్, కమలానగర్, టెలికామ్ నగర్, గఫార్‌నగర్, ప్రశాంతి నగర్, ఫుడ్ కార్పొరేషన్ ఏరియా, కిసాన్ నగర్, శ్రీనగర్‌కాలనీ,లెక్చరర్స్ కాలనీ, మాధవనగర్, సీ అండ్ బీ క్యాంపులు, గాయత్రీ ఎస్టేటు, లక్ష్మీనగర్, ఎస్టేటు సెక్షన్ పరిధిలోని అబ్బాస్‌నగర్, క్రిష్ణానగర్, న్యూ క్రిష్ణనగర్, తారకరామ్‌నగ ర్,ఓల్డ్ ఎంఆర్‌వో ఆఫీసు, ఎండోమెంట్‌కాలనీ, బిర్లా కాంపౌండు, గుత్తి రోడ్డు సర్కిల్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా బంద్ అవుతుందని తెలిపారు.

16న మహా నగర సంకీర్తన

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ ఉదయం 6 గంటలకు మహా నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కర్నూలు బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు తెలిపారు. నగరంలోని సీతారాంనగర్ పార్క్ దగ్గర నుంచి నగర సంకీర్తన ప్రాంభమవుతుందని పేర్కొన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్లానింగ్ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు

కర్నూలు (టౌన్): నగరపాలక పరిధిలోని వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న పలువురు ప్లానింగ్ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం సాయంత్రం నగర పాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ కారణాలతో సెలవుల్లో ఉన్న కార్యదర్శులు, ప్లానింగ్ కార్యదర్శుల స్థానంలో పలువురికి అదనపు బాధ్యతలు కేటాయించారు. 24, 25 సచివాలయాలకు బోయ తలారి రవికుమార్, 86 వ సచివాలయానికి కె. ప్రశాంత్, 113 సచివాలయానికి కె. నిఖిల్, 94 వ సచివాలయానికి వి. రఘునాథ్‌రెడ్డి, 57 వ సచివాలయానికి బి. సత్య స్వర్ణలతలకు బాధ్యతలు అప్పగించారు. పరిపాలన పరమైన ఇబ్బందులు రాకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ బాధ్యతలను ప్లానింగ్ కార్యదర్శులు వెంటనే చేపట్టాలని, లేకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

హుస్సేన్ పీరా మృతికి సంతాపం

కర్నూలు(సెంట్రల్) : కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన షేక్ జిలానీ బాష తండ్రి షేక్ హుస్సేన్ పీరా అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలియగానే ఆపార్టీ నాయకులు సంతాపం ప్రకటించారు.డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, ఎస్సీ సెల్ చైర్మన్ లాజరస్, మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాద్రిపాషా, సిటీ మైనార్టీ సెల్ చైర్మన్ ఖాజా హుస్సేన్ తదితర నాయకులు జిలానీ బాషాను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పదోన్నతులకు వేళాయే!

- నగరపాలకలో రెవెన్యూ ఆఫీసర్ పోస్టు ఖాళీ
- రేసులో 10 మంది
- సిద్ధమైన సీనియారిటీ జాబితా



నగరపాలక సంస్థ కార్యాలయం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో పదోన్నతుల ప్రక్రియ మొదలైంది. సార్వత్రిక ఎన్నికలు ముగియడం కొత్త ప్రభుత్వం సైతం కొలువుదీరింది. ఈ నేపథ్యంలో నగరపాలకలో పాలనకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ప్రత్యేకించి పదోన్నతులకు యంత్రాంగం శ్రీకారం చుట్టింది. నగరపాలకలో రెవెన్యూ విభాగం ముఖ్యమైనది. పన్నుల వసూళ్లలో ఈ శాఖే కీలకం. ఇక్కడ జునీద్, వీరస్వామి ఇరువురు రెవెన్యూ ఆఫీసర్లు పనిచేస్తున్నారు. అయితే, గత నెల 31 వ తేదీ వీరస్వామి పదవీ విరమణ చెందారు. దీంతో ఖాళీగా ఉన్న ఈ పోస్టు భర్తీకి చర్యలు చేపట్టారు. ఇదులో భాగంగానే నగరపాలకలో పనిచేసే సూపరింటెండెంట్ల జాబితాను అధికార యంత్రాంగం సిద్ధ చేసింది. సీనియారిటీలో వయస్సు, విద్యార్హత, కేటగిరి, సూపరింటెండెంట్లుగా ఏ సంవత్సరంలో పదోన్నతి పొందారు.. వారి సర్వీసు రికార్డు తదితర వివరాలు సేకరించి పరిశీలిస్తున్నారు.

రేసులో 10 మంది

నగరపాలక పనిచేసే ఉద్యోగుల్లో 10 మంది సీనియారిటీ జాబితాను రూపొందించారు. ఇందులో ఇప్పటికే సూపరింటెండెంట్లుగా పదోన్నతి పొందిన ఎస్ ఇశ్రాయేలు (2014), ఏవీ రమేష్ బాబు (2014), కేఎల్ఎన్ రెడ్డి (2014) ఎల్ రమేష్ బాబు (2014), ఎస్ ప్రసాద్‌గౌడ్ (2017), పీ క్రిస్టఫర్ బాబు (2020), ఎస్ మన్సూర్ బాషా (2020), ఏ స్వర్ణలత (2020), వీ సుబ్బన్న (2023), పీఎస్ఎస్ రాజేశ్వరరావు (2023) ఉన్నారు. వీరిలో నలుగురు ఉద్యోగులు 10 సంవత్సరాలకు పైగా సూపరింటెండెంట్లుగా పనిచేస్తుండటంతో పదోన్నతికి అర్హత ఉంది. అయితే, వారిలో కీలకమైన రెవెన్యూ అధికారి పోస్టు ఎవరికి దక్కుతుందో అతి త్వరలో తేలనుంది.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయండి

సిద్ధ చేసిన సూపరింటెండెంట్ల జాబితాలో అనుమానాలు, తప్పొప్పులు, ఏవైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా 7 రోజుల వ్యవధిలో తెలియజేయవచ్చని ఇప్పటికే నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. గడువు ముగిసిన తరువాత వచ్చే అభ్యంతరాలను పరిగణలోకి తీసుకులేమని వెల్లడించారు.

వేదావతిలో వరద ఉధృతి



మార్లమడికి వద్ద ప్రవహిస్తున్న వేదావతి నది

హొళగుంద: ఆంధ్రా–కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులోని మార్లమడికి వద్ద వేదావతి నదిలో వరద ఉధృతి శుక్రవారం కూడా కొనసాగింది. నది ఎగువ భాగంలోని రాయదుర్గం, గుంతకల్ తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా నీటి ప్రవాహం పెరిగింది. పంటల సాగకు అనువుగా మారిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరద ప్రవాహం పెరగడంతో రైతులు నదిలో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటర్లు, పైపులను తొలగించారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలోని భైరవాని దీప ప్రాజెక్ట్ నించి దిగువకు నీరు వదిలితే నది ఉగ్రరూపం దాల్చుతుందని ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయని మార్లమడికి గ్రామస్తులు తెలిపారు. కాగా నదిపై నిర్మించిన వంతెన ఎత్తు లేకపోవడం వల్ల తరుచూ రాకపోకలు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని.. కొత్త వంతెన నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వై.నగేష్

కర్నూలు(సెంట్రల్) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పిన విధంగా 25 వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్ నిరుద్యోగులను ఎంతో నిరాశ పరిచిందన్నారు. శుక్రవారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎన్నికల ముందు మెగా డీఎస్సీ అని చెప్పి 16,347 పోస్టుల భర్తీకే నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 117ను రద్దు చేస్తే వేలాది పోస్టులు ఖాళీ అవుతాయన్నారు.. ఉద్యోగుల పదవి విరమణ వయసును 58 ఏళ్లకు తగ్గించాలన్నారు. అప్పుడు 50 వేల ఉపాధ్యాయ పోస్టులుఖాళీ అవుతాయని, వాటన్నింటినీ భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే నిరుద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్ర, హుస్సేన్‌బాషా, అబ్దుల్లా పాల్గొన్నారు.

స్పోర్ట్స్

నిత్య సాధనతోనే ఉజ్వల భవిష్యత్



రోడ్డు రేసు విజేతలకు మెమెంటోలు, మెడల్స్ అందజేసిన డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్) : నిత్య సాధన ద్వారానే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు స్పష్టం చేశారు. శుక్రవారం ఒలింపిక్ డే సంబరాల్లో భాగంగా స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో రోడ్డు రేస్ పోటీలు నిర్వహించారు. పోటీలను మాంట్రో ఎలక్ట్రికల్ ఆటో మేనేజర్ చంద్రశేఖర్‌తో కలిసి డీఎస్‌డీవో ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఒలింపిక్ డే నిర్వహణ ఉద్దేశం అదేనన్నారు. క్రీడల్లో రాణిస్తే ఎన్నో అవకాశాలు లభిస్తాయన్నారు.రోడ్డు రేసు పోటీల్లో ప్రతిభ చాటి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెమెంటోలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షవర్ధన్, గంగాధర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఒలింపిక్ డే రన్ క్రీడా పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 16 నుంచి 20 వ తేదీ వరకు ప్రపంచ ఒలింపిక్ డేను పురస్కరించుకొని 16 క్రీడాంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు కేఈ జగదీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 వ తేదీన తైక్వాండో, స్విమ్మింగ్ 18 వ తేదీ యోగ, హాకీ, ఉషు, కరాటే, చెస్ 19 వ తేదీ వాలీబాల్, టెన్నికాయిట్, సెపక్‌తక్రా, షూటింగ్‌బాల్, కబడ్డీ, క్యారెమ్ 20 వ తేదీ సాఫ్ట్‌బాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్ వంటి క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు.

రక్తదానం చేసి ప్రాణ దాతలు కండి



రక్తదానం చేస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్) : అత్యవసర సమయాల్లో రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేజీ గోవిందరెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో సీఐటీయూ నాయకుడు పర్సా సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కాగా, రక్తదానం చేస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తవన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ..రక్తదానం చేయడంలో ఎంతో సేవ ఉందన్నారు. పశ్చిమ బెంగాల్లో మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేక పోరాటాల్లో వేలాదిమంది కార్యకర్తలు రక్తదానం చేసి నిరసన తెలిపారన్నారు.. కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కీన్వనర్ పి.నిర్మల. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, , నాయకులు నాగేశ్వరరావు, సాయిబాబా, టి.రాముడు పాల్గొన్నారు.

విశ్వభారతిలో రక్తదాతలకు సన్మానం



సన్మాన గ్రహీతలతో కళాశాల వైద్యులు

కర్నూలు (హాస్పిటల్) : నగర శివారులోని పెంచికలపాడు గ్రామంలో ఉన్న విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్‌లో శుక్రవారం రక్తదాతలకు సన్మానం చేశారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో రక్తదాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మునీరుద్దీన్ అహ్మద్, ప్రొఫెసర్ డాక్టర్ మహేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే రోడ్లన్నీ జలమయం




బాలాజీనగర్‌లో రోడ్డుపై వర్షపు నీరు, వెంకటరమణ కాలనీ విశాల్ మార్ట్ ఎదురుగా..



కిసాన్‌ఘాట్ రోడ్డులో..

కర్నూలు (న్యూటౌన్): వర్షం పడితే చాలు కర్నూలు నగరంలోని రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. చిన్నపాటి వర్షం పడితే చాలు రోడ్లపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కర్నూలు నగర శివారులోని బాలాజీనగర్, వెంకరమణ కాలనీ మెయిన్‌రోడ్డు, కిసాన్ ఘాట్ రోడ్డులో సమస్య తీవ్రంగా ఉంది. పక్కనే హంద్రీనది ఉన్నా ఆ నీటిని నదిలోకి మళ్లించకపోవడంతో వాహనదారులు బురదనీటిలో వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు స్పందించి రోడ్లపై నిలుస్తున్న నీటిని కాల్వల్లోకి మళ్లించాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

సుంకేసులకు పెరిగిన ఇన్‌ఫ్లో

గూడూరు రూరల్: ఎగువ ప్రాంతాల నుంచి నీరు వచ్చి చేరుతుండడంతో సుంకేసుల రిజర్వాయర్‌కు శుక్రవారం ఇన్‌ఫ్లో పెరిగినట్లు డ్యాం జేఈ శ్రీనివాస రెడ్డి తెలిపారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రిజర్వాయర్‌కు నీటిరాక పెరిగిందన్నారు. 4,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఒక గేటును తెరిచి దిగువకు 4,311 క్యూసెక్కులను వదులుతున్నామన్నారు. రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 1.200 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 1.026 టీఎంసీ నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

సేంద్రియ సాగు.. ఫలితాలు బాగు

- సేంద్రియ వ్యవసాయంతో సత్ఫలితాలు
- అంతర పంటలతో అధిక లాభాలు
- ఎరువులు, గోఆధారిత ఎరువులతో పంటలకు రక్ష
- కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి సూచనలు



రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న ఏడీఏ సాలురెడ్డి

కర్నూలు (అగ్రికల్చర్): లాభసాటి వ్యవసాయానికి, అధిక దిగుబడులు పొందడానికి వ్యవసాయ సుస్థిరత ఎంతో ముఖ్యమైంది. ఆహారభద్రతకు, పౌష్టికాహార ఉత్పత్తికి, సహజవనరులు, పరిసరాల పరిరక్షణకు తోడ్పడుతుంది. సేంద్రియ వ్యవసాయంతోనే ఇది సాధ్యమవుతుంది. వ్యవసాయంలో సుస్థిరత తేవాలంటే రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు దృష్టి సారించాలి. ఇటీవల కాలంలో సేంద్రియ వ్యవసాయంపై ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తున్నాయి. వ్యవసాయ, ఉద్యాన పంటల్లో సుస్థిరత తీసుకురాడానికి కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి సూచనలు.

యాజమాన్య పద్ధతులు

- పంట మార్పిడి తప్పనిసరిగా పాటించాలి. అనువైన అంతర పంటలు వేయాలి. పచ్చిరొట్ట పైర్లకు, పచ్చి ఆకు రొట్టకు ప్రాధాన్యత ఇవ్వాలి. వ్యవసాయ వ్యర్థాలను సమర్ధవంతంగా ఉపయోగించాలి.
- పూర్తిగా కుళ్లిన సేంద్రియ ఎరువుల వాడకం, పరిశుభ్రమైన సాగు, సకాలంలో కలుపు నివారణ జరగాలి. సేంద్రియ ఎరువులు, జీవ ఎరువులు విరివిగా వినియోగించడం ముఖ్యం.
- సాగునీరు సద్వినియోగం, యాజమాన్యంపై దృష్టి పెట్టాలి. రసాయనాలు వాడకుండా సహజ వనరుల ద్వారా భూసారాన్ని పెంపొందించడం, సహజ సస్యరక్షణ యాజమాన్యం చేపట్టడం, జీవన నియంత్రణ పద్ధతులు, వృక్షసంబంధ మందులకు ప్రాధాన్యత ఇవ్వాలి.

అంతరపంటలతో అధిక లాభాలు

సాధారణంగా రైతులు ఒక సీజన్‌లో ఒకే పంటను సాగు చేస్తుంటారు. ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడల బెడద వల్ల పంట దెబ్బతింటే రైతులు ఆర్థికంగా నష్టపోతారు. సరైన ప్రణాళికతో అవగాహనతో రెండు లేదా మూడు పంటలను ఒకేసారి సాగు చేయవచ్చు. రెండుగాని అంతకన్నా ఎక్కువ పంటలను ఒక నిర్దిష్టమైన నిష్పత్తిలో సాగు చేస్తే వాటిని అంతర పంటలు అంటారు. అంతర పంటల క్రమంలో ఒకటి ప్రధాన పంట, రెండోది అంతర పంట అయి ఉండాలి.

అనువైన అంతర పంటలు

నేల నుంచి పోషక పదార్థాలు, నీరు గ్రహించే లోతులో వ్యత్యాసాలు ఉండే వేర్ల నిర్మాణం కలిగిన పంటలను అంతర పంటలుగా ఎన్నుకోవాలి. ఒక పంట ఇంకో పంట దిగుబడిని పెంపొందించే విధంగా ఉండాలి. పోషక పదార్థాలు, నీరు, వెలుతురు విషయంలో పంటల మధ్య పోటీ ఉండరాదు. వేర్వేరు కాలపరిమితుల్లో ఉన్న పంటలు, పుష్పజాతి పంటలను కలపడం వల్ల పోషక పదార్థాల ఆవశ్యకత, తేడాలతో కీలక దశల్లో పోటీ ఉండకుండా ఆరోగ్యంగా పెరుగుతాయి. ఒక పంటను రెండో పంటగా పెరగడానికి ఆధారంగా పెంచవచ్చు. ఉద్యాన పంటల్లో తొలుత నాలుగైదేళ్ల వరకు చెట్ల మధ్య ఖాళీ ప్రదేశంలో వివిధ పంటలు పండించవచ్చు. పంటల పెరుగుదలకు సంబంధించి పొడవు, పొట్టి వ్యత్యాసాలను బట్టి రెండు అంతకంటే ఎక్కువ పంటలను వివిధ అంతస్తుల్లో పండించవచ్చు. ఒక పంటపై ఆశ్రయించే పురుగుల నిర్మూలనకు మరో పంటపై ఆ పురుగుల నుతినే సహజ శత్రువులను పెంపొందించడానికి కూడా అంతరపంటలు అవసరం. ప్రధాన పంటను ఆశించే పురుగులను అంతర పంటపై ఆకర్షింపజేసి చీడ పీడల బారి నుంచి ప్రధాన పంటను రక్షించుకోవచ్చు.

సేంద్రియ వ్యవసాయం.. ఉపయోగాలు

- ఆరోగ్యానికి పరిసరాల మిత్రత్వానికి, కాలుష్య నివారణకు దోహదపడుతుంది. జీవ వైవిద్యానికి నాంది పలుకుతూ జన్యు వైవిధ్యం ఏర్పడుతుంది.
- సహజ వనరులు రాబోయే తరాల వారికి కూడా అందుబాటులో ఉంటాయి. నేల, మొక్కలు, జంతువులు ఒకదానికొకటి పరిసరాలకు అనుగుణంగా ఉంటాయి. నేల గుల్లబారుతుంది. మురుగు నీరు పోయే సౌకర్యం పెరుగుతుంది. నేలలో తేమ, గాలి, మొక్క సంబంధాల్లో అనుకూలత ఏర్పడుతుంది.
- నీరు పట్టి ఉంచుకునే శక్తి పెరుగుతుంది. వేర్లు బాగా భూమిలోకి చొచ్చుకెళ్లే లక్షణం కలిగి ఉంటుంది. భౌతిక లక్షణాలు వృద్ధి చెందుతాయి. మొక్కకు పోషకాలు బాగా అందుబాటులోకి వస్తాయి. నేలకు వాటిని పట్టి ఉంచుకునే గుణం పెరుగుతుంది. వ్యవసాయ సుస్థిరత పెరుగుతుంది. సురక్షిత ఆహారం లభిస్తుంది.
- ఆహారంలోకి విషపదార్థాలు ప్రవేశించే అవకాశం ఉండదు. ఖరీదైన పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం లేదు. నేల ఉత్పాదకత, భూసారం నిలకడగా ఉంటాయి. పంటలో నాణ్యత పెరుగుతుంది.
- నేల, నీరు వ్యవసాయ ఉత్పత్తులు కాలుష్యానికి గురికావు. సేంద్రియ, జీవన ఎరువుల వినియోగం వల్ల మొక్కకు అవసరమైన ఉప సూక్ష్మపోషకాలు తగుమోతాదుల్లో లభ్యమవుతాయి. చీడ పీడల తాకిడి తగ్గుతుంది.




కోడుమూరు లక్ష్మనగర్‌లో సంచరిస్తున్న జింక,ఊరిబయటకు తరిమేందుకు యత్నిస్తున్న యువకుడు

జనారణ్యంలోకి జింక

కోడుమూరు రూరల్: మంద నుంచి విడిపోయిన ఓ మగ జింక శుక్రవారం కోడుమూరు పట్టణంలోని లక్ష్మీనగర్, వెంకటేశ్వర్ నగర్‌లలో నాలుగైదు గంటల పాటు హల్‌చల్ చేసింది. ఇళ్ల మధ్య ఎటు వెళ్లాలో తెలియక తికమక పడుతూ అటు ఇటూ పరుగెత్తసాగింది. కుక్కలు దాని వెంట పడ్డాయి. కొందరు యువకులు గంటకుపైగా శ్రమించి పట్టణంలోని కొండవైపు తరిమేయడంతో జింక అటుగా వెళ్లిపోయింది.

రెండో హాస్టల్ ఏర్పాటు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్ల సీట్లకు ఎక్కువగా డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో రెండో హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఈమేరకు శుక్రవారం బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మికి ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సోమన్న వినతిపత్రం సమర్పించారు.

కేజీబీవీలో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని కస్తూర్బా గాంధీ మైనార్టీ విద్యాలయంలో ఎంపీహెచ్‌బ్ల్యూ (నర్సింగ్) కోర్సును ప్రవేశ పెట్టినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.అంజలిదేవి శుక్రవారం తెలిపారు. ఇంటర్మీడియెట్ కోర్సులలో భాగంగా రిటైల్ మార్కెటింగ్ కోర్సును విద్యాలయంలో అధికారులు ప్రవేశపెట్టారు. అయితే ఈ కోర్సుపై విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సును ప్రవేశపెట్టాలని అధికారులకు విన్నవించడం జరిగిందన్నారు. వెనుకబడిన ప్రాంతం అందులో బాలికలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే కోర్సు కావడంతో అధికారులు స్పందించి ఈ కోర్సును ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టీసీ, పదోత తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు జిరాక్స్, ఫొటో తదితర సర్టిఫికెట్లు జతచేయాలన్నారు. ఏమైనా సందేహాలుంటే భాస్కర్ రెడ్డి కాలనీలోని కేజీబీవి మైనార్టీ విద్యాయలంలో సంప్రదించాలన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యువతకు స్ఫూర్తి చేగువేరా



చేగువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్) : ప్రపంచంలోని యువతీ, యువకులకు చేగువేరా స్ఫూర్తి అని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ అన్నారు. శుక్రవారం చేగువేరా జయంతిని పురస్కరించుకొని డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా చేగువేరా పోరాడారన్నారు. పేదలకు అండగా నిలబడారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆదర్శ భావాలను ఒంట బట్టించుకొని సొంత ప్రాంతాల్లో జరుగుతున్న అన్యాయాలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు హుస్సేన్‌బాషా, విజయ్, వెంకటరాముడు, అబ్దుల్లా, బజారి, రఫీ పాల్గొన్నారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, కర్నూలు
I.P.No: 56/2023
షేక్ ఖాజా బాషా.. ..అర్జిదారు
-Versus-
రాజు మరియు 52 వగైరాలు ..రెస్పాండెంట్స్
జనరల్ నోటీసు
కర్నూలు జిల్లా, కర్నూలు గ్రామ ప్రజలకు తెలియజేయడమేమనగా పై నెంబరు గల ఐ.పి.లో అర్జిదారు అయిన షేక్ ఖాజా బాషా తండ్రి షేక్ రహిమాన్, వ్యాపారం, ఇంటి నెం.4-45-బి, కల్లూరు దర్వాజ, ఉస్మానియా కాలేజ్ రోడ్, కర్నూలు అను నతదు తనను దివాళాదారుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో దివాలా అర్జి దాఖలు చేసినాడు. ఇందులో ఎవరికైనా ఆక్షేపణలు వున్న 02-07-2024వ తేది పగలు 10:30 గం॥లకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పరోక్షమున విచారించి తీర్మానించబడును.
ఎస్. అల్లి బాషా, B.A., LLB
అడ్వకేట్, కర్నూలు.
సెల్: 94410 59928

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కర్నూలు
70750 09218
Office mail : sakshiknladvt@gmail.com